నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | SANGAREDDY

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

రైస్‌మిల్లులో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

రాయపోల్, ఫిబ్రవరి 13 :సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారంలోని సాయి మహదేవ్ రైస్‌మిల్లులో విజిలెన్స్ అధికారులు బుధవారం రాత్రి దాడిచేసి 431 క్వింటాల్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శశిధర్‌రాజు కథనం ప్రకారం.. రెండేండ్ల నుంచి సాయి మహదేవ్ రైస్‌మిల్లుకు ప్రభుత్వం సీఎంఆర్ పర్మిషన్ నిలిపివేసింది. కానీ, మిల్లు నిర్వాహకులు ఎలాంటి అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి పలు రైస్‌మిల్లుల పేరు మీద ప్రభుత్వానికి సరఫరా చేస్తున్నారు. నిర్వాహకునిపై కేసు నమోదు చేశారు. దాడిలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనూజ, రాఘవేందర్, ప్రవీణ్, రాజిరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

పరిహారానికి ఎదురుచూపులు

- మల్లన్నసాగర్ నిర్వాసితులకు అండగా ఉంటామన్న కాంగ్రెస్
- అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ప్యాకేజీ ఊసేలేదు
- సీఎం రేవంత్ హామీ బుట్టదాఖలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న మల్లన్నసాగర్ భూనిర్వాసితులు
- కలెక్టరేట్‌లో విన్నపాలు

గజ్వేల్‌లో మల్లన్నసాగర్ సాగర్ నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

గజ్వేల్, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా తమకు పరిహారం అందడం లేదని పలువురు మల్లన్నసాగర్ భూనిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణానికి భూసేకరణ చేపట్టి 2013 భూసేకరణ చట్టం ప్రకారం బాధితులకు అండగా నిలబడి అర్హులైన కుటుంబాలకు పరిహారం అందించింది. కోర్టు కేసులు, చిన్నపాటి కారణాలతో కొంతమందికి పరిహారం అందించలేకపోయింది. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల కోసం భూములు సేకరిస్తున్న సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఆనాడు బాధితుల పక్షాన నిలబడింది. అధికారంలోకి వస్తే అండగా నిలబడి న్యాయం చేస్తామన్న హామీఇచ్చింది. తీరా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండో ఏడాది నడుస్తున్నా పరిహారం చెల్లింపుపై ఎలాంటి చొరవ తీసుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. భూసేకరణ సమయంలో బాధితుల పక్షాన ఏటిగడ్డ కిష్టాపూర్‌లో రెండురోజుల పాటు నిరాహార దీక్ష చేసిన రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వస్తే అండగా నిలబడి ఆదుకుంటామని హామీఇచ్చారు. కానీ, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితుల్లో కొంతమందికి రావాల్సి ప్యాకేజీపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో కొండపాక, తొగుట మండల్లాల్లోని 14 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వీరందరికీ కేసీఆర్ ప్రభుత్వం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల మధ్య 600 ఎకరాల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీని నిర్మించింది. కోర్టు కేసులు, ఇతరత్రా కారణాలతో పలువురు బాధితులకు ప్యాకేజీ దక్కలేదు. వారంతా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఏటిగడ్డ కిష్టాపూర్‌లో 1253, లక్ష్మాపూర్‌లో 388, వేములఘాట్‌లో 1252, పల్లెపహాడ్‌లో 921, రాంపూర్‌లో 320, బ్రాహ్మణ బంజేరుపల్లిలో 267, ఎర్రవల్లిలో 800, సింగారంలో 330కి పైగా కుటుంబాలు ఉన్నాయి. వీరికోసం 2273 డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేసీఆర్ ప్రభుత్వం నిర్మించి ఇచ్చింది. ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూమితో పాటు ఇతర ఆస్తులకు పరిహారం ఇవ్వడం, ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.7.50 లక్షలు, ఇల్లు అందజేసింది. ఇల్లు వద్దనుకున్న వాళ్లకు ఓపెన్ ప్లాట్, మరో 5.04లక్షలు అందజేసింది. 18 ఏండ్లు నిండిన మగవారికి ఓపెన్ ప్లాట్, ఆడబిడ్డలకు పరిహారం చెక్కులను అందజేసింది. ఇదే తరహాలో కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాల ప్రజలకు ప్యాకేజీలను ప్రభుత్వం అందజేసింది. ములుగు మండలం తునికిబొల్లారం వద్ద 1141 డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించింది. మరి కొంతమంది యువతకు ఓపెన్ ప్లాట్‌లను పంపిణీ చేయాల్సి ఉంది.

ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ...

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మల్లన్నసాగర్ నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పూర్తిస్థాయి పరిహారం కోసం ప్రతి వారం సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులను వెల్లువల సమర్పిస్తున్నారు. న్యాయంగా రావాల్సిన ప్యాకేజీలను త్వరగా ప్రభుత్వం నుంచి ఇప్పించాలని బాధితులు అధికారులను వేడుకుంటున్నారు. చిన్నపాటి సమస్యలతో ప్యాకేజీల ఆలస్యం చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గతేడాది మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, నర్సారెడ్డి ఏటిగడ్డ కిష్టాపూర్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని, అందరికీ న్యాయం చేస్తామని చెప్పిపోయారు. అప్పట్లో ఎంతో ఆర్భాటంగా మాజీ ఎమ్మెల్యేలు సమావేశం నిర్వహించారు. వారిచ్చిన హామీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. వస్తారు పోతారు తప్పా తమ సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ నేతలకు లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల బదిలీలతో నిర్వాసితుల నిరాశ ..

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణలో విధులు నిర్వర్తించిన అధికారులు జిల్లా నుంచి ఒక్కొక్కరుగా బదిలీలు అయ్యారు. దీంతో తమ బాధలు ఎవరికీ చెప్పుకోవాలంటూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారుల బదిలీలు జరిగినా డివిజన్, జిల్లా అధికారులకు సమస్యను చెప్పుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం జిల్లా కలెక్టరేట్‌లో అంతా కొత్తగా వచ్చిన అధికారులే ఉండడంతో తమ సమస్యలపై వినతిపత్రాలను ప్రజావాణిలో ఇస్తున్నారు. కానీ, వాటి పరిష్కారానికి మోక్షం లభించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలపై స్పందించడం లేదని వాపోతున్నారు.

డంపింగ్ యార్డును అడ్డుకుందాం

- పోరాటానికి కాంగ్రెస్ నేతలు మాతో కలిసి రావాలి
- కాంగ్రెస్ నేతలు అభివృద్ధి నిరోధకులుగా మిగలకండి
- బట్టకాల్చి మీద వేయడం తగదు
- మేము చేసిన అభివృద్ధి కనిపించడం లేదా..
- మీడియా సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 13 : ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటును అడ్డుకోవడానికి కాంగ్రెస్ నాయకులు జేఏసీతో కలిసి పోరాటాల్లో పాల్గొనాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరారు. గురువారం నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పంతాలకు పోయి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని హితవు పలికారు. భూసర్వే చేసేవరకు డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలని హైకోర్టు ఆర్డర్స్ ఇచ్చినట్లు తెలిపారు. డంపింగ్ యార్డు ఏర్పాటైతే గుమ్మడిదల మండలం, నర్సాపూర్ నియోజకవర్గానికి శాపంలా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా జేఏసీ ఏర్పాటు చేసుకుందామని గతంలో కోరగా, కాంగ్రెస్ నాయకులు ముందుకు రాలేదన్నారు. డంపింగ్ యార్డుకు బీఆర్ఎస్ అనుమతులు ఇచ్చిందని రాజకీయం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. డంపింగ్‌యార్డు ఏర్పాటైతే కలుషిత నీరు రాయారావు చెరువులోకి చేరి అక్కడి నుంచి గొలుసుకట్టు ద్వారా మిగతా చెరువుల్లోకి కలుషిత నీరు చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రుస్తుంపేట్, రాంచంద్రాపూర్, కాసాలా, రెడ్డిఖానాపూర్ అక్కడి నుంచి ఘనపూర్ ఆనకట్ట వరకు నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందన్నారు. దీంతో ఆయకట్టు ప్రశ్నార్థంగా మారే ప్రమాదం ఉందన్నారు. వీటిపై కాంగ్రెస్ నాయకులు స్పందించకుండా బట్టకాల్చి బీఆర్ఎస్ వేయడం తగదని మండిపడ్డారు.

కాంగ్రెస్ హయాంలోనే బీజం...

డంపింగ్‌యార్డు ప్లాన్‌కు సంబంధించి 2009లోనే ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారని, కానీ.. కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ మాట్లాడిన వీడియోలు చూపెడుతూ మభ్యపెడుతున్నారని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. కేటీఆర్ మాట్లాడింది నిజమేనని, 2008-09లో జవహర్‌నగర్ ప్రాంతమంతా కలుషితమైతే ప్రజలంతా కోర్టుకెళ్తే జీహెచ్ఎంసీ చెత్తంతా అక్కడకు తీసుకువస్తే ప్రజల ఆరోగ్యాలకు ఇబ్బంది కలుగుతుందని, జీహెచ్ఎంసీ చుట్టుపక్కలకు చెత్తను తరలించాలని కోర్టు ఆదేశించినట్లు గుర్తుచేశారు. ఆ విధంగా 2008-09లోనే ప్యారానగర్, లక్డారం, చౌటుప్పల్ డంపింగ్‌యార్డుల కోసం ఎంపిక చేసి కోర్టుకు నివేదించినట్లు తెలిపారు. 2014లో డంపింగ్ యార్డు నిర్మాణం జరగాల్సి ఉన్నా, తెలంగాణ ఉద్యమం మూలంగా ఆగిపోవడం జరిగిందని, 2015లో నిర్మాణం ప్రారంభిస్తే అటవీ శాఖ నుంచి క్లియరెన్స్ రావడానికి సమయం పట్టిందని ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంగా తెలిపాడని గుర్తుచేశారు. గుమ్మడిదల మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు, ప్రజలు ప్యారానగర్ ప్రాంతంలో డంపింగ్ యార్డు వద్దని తీర్మానాలు చేశారని, ఈ తీర్మానాలను తీసుకొని హరీశ్‌రావు, కేటీఆర్ వద్దకు గతంలో వెళ్లినట్లు గుర్తుచేశారు. అటవీ ప్రాంతమని తమకు తెలియదని, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ భూమిని కేటాయించిందని కేటీఆర్, హరీశ్‌రావు ఈ నిర్మాణాన్ని నిలిపివేశారని స్పష్టంగా తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో డంపింగ్ యార్డు నిర్మాణం జరగలేదని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 13 నెలల తర్వాత ఈ పనులు ప్రారంభించిందని గుర్తుచేశారు. డంపింగ్‌యార్డు పనులు ఎవరు ప్రారంభించారో ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలని సునీతాలక్ష్మారెడ్డి హితవు పలికారు. కాంగ్రెస్ నాయకులు చూపించే పత్రాలు కేవలం అటవీ భూమిని కేటాయించిన వివరాలు మాత్రమే ఉన్నాయని, దానిని పట్టుకొని బీఆర్ఎస్‌ను బద్నాం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. జీహెచ్ఎంసీకి భూమిని అప్పగిస్తే డంపింగ్ యార్డు పెడతారని అప్పట్లో తెలియదని గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోనే డంపింగ్ యార్డు పెట్టుకోవాలని కోర్టు చెబితే, దానిని తుంగలో తొక్కి నేడు జీహెచ్ఎంపీ పరిధి కాకుండా ప్యారానగర్‌లో పెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని సునీతాలక్ష్మారెడ్డి మండిపడ్డారు. 2008లోనే డంపింగ్ యార్డు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్ తెలిపిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఇప్పుడేమో దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాలకు అతీతంగా గుమ్మడిదల, నర్సాపూర్ ప్రాంతాలను ఈ విష కాలుష్యం నుంచి కాపాడడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

అభివృద్ధి కనిపించడం లేదా..

తాము చేసిన అభివృద్ధి కనిపించడం లేదా అని కాంగ్రెస్ నాయకులను సునీతాలక్ష్మారెడ్డి మండిపడ్డారు. కొల్చారం, చిలిపిచెడ్ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ విషయంలో మంత్రి వచ్చి ఇస్తారని నిలిపివేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మిగలొద్దని, ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని హితవు పలికారు. ఎమ్మెల్యేగా ప్రపోజల్ పంపిస్తేనే అనుమతులు వస్తాయని, దీని కెందుకు గ్రామాల్లో అలజడులు సృష్టిస్తున్నారని ఆమె మండిపడ్డారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయూమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు షేక్‌హుస్సేన్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలు అభివృద్ధి నిరోధకులు

- అనేక హామీలిచ్చి ప్రజలను మోసం చేశారు
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ధ్వజం

మహదేవుపల్లి చౌరస్తాలో హైవేపై రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 13: లెక్కలేనన్ని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శించారు. గురువారం కల్హేర్ మండలం మహదేవుపల్లి చౌరస్తాలో 161నంబర్ జాతీ య రహదారి పై ఆయన ఆధ్వర్యంలో కల్హేర్, నిజాంపేట్ మం డలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి నిరోధకులుగా మిగిలారని మండిపడ్డారు. మహదేవుపల్లి రోడ్డు నుంచి కల్హేర్ మీదుగా నల్లవాగు, కల్హేర్ నుంచి పిట్లం వరకు బీటీ రోడ్లు నిర్మాణానికి, నారాయణఖేడ్ నుంచి ర్యాకల్ వరకు రోడ్డు మంజూరు చేస్తే, కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశారన్నారు. తాను మంజూరు చేయించిన పనులను ప్రారంభించకుండా ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. పదేండ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా తయారైందన్నారు. రాస్తారోకోలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ జడ్పీ కో ఆప్షన్‌సభ్యుడు అలీ, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ దిలీప్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు నారాయణరావు, దుర్గారెడ్డి, అంజిరెడ్డి, బాలయ్య, ప్రభు, నర్సింహగౌడ్, సాయిలు, గణపతి, లక్ష్మణ్, రాంసింగ్, వెంకట్‌నాయక్, జనార్ధన్ సాన్, పండరి, కుర్మసాయిలు, ప్రశాంత్‌సాగర్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కీలకంగా వ్యవహరించాలి

మెదక్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్టేజ్-2 అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి గురువారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజు అత్యంత కీలకమని, నిబద్ధతతో పని చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించాలని, వసతులు లేకపోతే ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలన్నారు. అదనపు కలెక్టర్ నగేశ్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, ఆర్డీవో రమాదేవి, డీఈవో రాధాకిషన్, సైన్స్ అధికారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించడం కాంగ్రెస్‌కు తగదు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, ఫిబ్రవరి 13: ఎన్నికల్లో హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత విస్మరించడం తగదని, పార్టీ ఫిరాయింపులపై కఠిన చట్టాలను తేవాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి స్మారక భనవంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఫిరాయిస్తే వెంటనే అనర్హత పడేలా చట్టాలు ఉండాలన్నారు. ఎన్నికల్లో నేర చరిత్ర కలిగిన వారు పోటీ చేయకుండా ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు విధించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కులగణన రీసర్వే చేయడం మంచి పరిణామమని, ఇందులో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. రీసర్వే అనంతరం బీసీలకు ప్రకటించిన 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు సత్యనారాయణ, వనేశ్, కొమ్ముల భాస్కర్, గోపి, సంజీవరెడ్డి, సుదర్శనాచారి, రాజు, గూడ పద్మ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సేవ్ ఫార్మర్-సేవ్ ఫారెస్ట్

- డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసనలు
- తెలంగాణ ఉద్యమాన్ని తలపించిన ఆందోళనలు
- వందలాది మంది విద్యార్థులతో ఎన్‌హెచ్‌పై భారీ ర్యాలీ


నల్లవల్లిలో పదో రోజుకు చేరిన రిలే నిరాహారదీక్ష

గుమ్మడిదలలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుమ్మడిదల,ఫిబ్రవరి 13: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. గురువారం గుమ్మడిదల పట్టణంలో జాతీయ రహదారి 765-డీపై వివిధ పాఠశాలల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. సేవ్ ఫారెస్ట్, సేవ ఫార్మర్ అంటూ నినాదాలు చేశారు. గుమ్మడిదలలో రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో డంపింగ్‌యార్డు వ్యతిరేక పోరాటం ముమ్మరంగా కొనసాగుతున్నది. గురువారం దీక్షా శిబిరం విద్యార్థులు, మహిళా సంఘాలు, రైతు సంఘాల నాయకులు, అఖిలపక్ష నాయకుల నినాదాలతో మార్మోగింది. గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్ష మూడో రోజుకు చేరకుంది. దివ్యాంగులు దీక్షలో కూర్చుని మద్దతు తెలిపారు. బొంతపల్లి, దోమడుగులో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. డంపింగ్‌యార్డు ఏర్పాటుతో కలిగే నష్టాలపై జనచైతన్య కళా సంస్థ కళాకారుడు వీఎం ఎల్లయ్య జానపద గేయాలతో అవగాహన కలిగించారు. మాజీ ఎంపీపీ సద్దిప్రవీణా విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్టన ర్సింగ్‌రావు, మాజీ సర్పంచ్‌లు చిమ్ముల నర్సింహారెడ్డి, తులసీదాసు, ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మూడుచింతల నరేందర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, సీపీఎం నాయకులు కె.రాజయ్య, మహ్మద్ హుస్సేన్, రైతులు పడమటి లక్ష్మారెడ్డి, పోచుగారి మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, స్వేచ్ఛారెడ్డి, గోపాల్, మంగయ్య తదితరులు దీక్ష శిబిరంలో దివ్యాంగులకు సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు పదో రోజుకు చేరాయి. గ్రామంలో యువకులు ర్యాలీ నిర్వహించారు. ఫయాజ్‌షరీఫ్, కుమ్మరి ఆంజనేయులు, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్,చాపల మధు తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేసిన రెవెన్యూ అధికారులు..

ప్యారానగర్ అటవీ ప్రాంతంలో 152 ఎకరాల్లో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు తమ వ్యవసాయభూమిని స్వాధీనం చేసుకున్నారని పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు.హైకోర్టు సర్వే చేసి పిటిషనర్లకు భూమి హద్దు చూపించాలని ఆదేశించింది. దీనికోసం తాత్కాలికంగా పనులు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం జిల్లా సర్వేయర్ ఏడీ బాల్‌రాజ్, మండల సర్వేయర్ యాదయ్య, గుమ్మిడిదల తహసీల్దార్ గంగాభవానీ పర్యవేక్షణలో సర్వే చేపట్టారు. ఈనెల 19 వరకు సర్వే చేపడతామని తహసీల్దార్ తెలిపారు.

గుమ్మడిదలలో దివ్యాంగుల దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ ఎంపీపీ , మాజీ జడ్పీటీసీ

గుమ్మడిదలలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా విద్యార్థుల భారీ ర్యాలీ

మాకు న్యాయం చేయాలి

డీడీఎస్ మహిళా సంఘాల సభ్యుల ఆందోళన

పస్తాపూర్ డీడీఎస్ కార్యాలయ ప్రతినిధి రుక్మిణీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న బాధిత మహిళా సంఘాల సభ్యులు

జహీరాబాద్, ఫిబ్రవరి 13 : డీడీఎస్ సంస్థ ప్రతినిధులు అమ్మిన భూములు తిరిగి ఇవ్వడంతో పాటు ఎఫ్‌డీఆర్, పీడీఎస్, డిపాజిట్ డబ్బులను వెంటనే చెల్లించాలని డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. డీడీఎస్ ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అక్రమాలతో నష్టపోయిన బాధిత మహిళా సంఘాల సభ్యుల సమావేశాన్ని గురువారం జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ గ్రామ శివారులో నిర్వహించారు. సమావేశంలో పస్తాపూర్ డీడీఎస్ వ్యవసస్థాపక మాజీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేఎస్ గోపాల్ మాట్లాడారు. డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులకు అండగా ఉండి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1979 నియోజవర్గం లోని 75 గ్రామాల్లో మహిళా సంఘాలతో పస్తాపూర్‌లో డీడీఎస్ (ప్రాజెక్టు) సంస్థనును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5వేల మంది మహిళలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చామని గుర్తుచేశారు. డీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 43 గ్రామాల్లోని 2,600 ఎకరాల్లో మహిళా సంఘాల సభ్యులతో చిరుధాన్యాలు పండిస్తూ వాటిని కాపాడుతున్నట్లు చెప్పారు. సభ్యుల పిల్లలకు పౌష్టికాహారం కింద చిరుధాన్యాలు అందించినట్లు గుర్తుచేశారు. మహిళలు పొదువు చేసిన డబ్బులు బ్యాంకులో రూ. 3కోట్ల వరకు డిపాజిట్ ఉన్నట్లు తెలిపారు. అంతర్జాతీయ దాతలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ. 12 కోట్లను నిధులు సేకరించినట్లు తెలిపారు. 2005లో దాతల పర్యవేక్షణ ముగిసిన తర్వాత మహిళా సంఘాలకు తెలియకుండానే 2006లో రూ.62, 68, 600ను జోవర్ అల్టర్నేట్ పీడీఎఫ్ డీడీఎస్ సంఘం రివాల్వింగ్ ఫండ్ ఎఫ్‌డీ సర్టిఫికెట్‌ను ఫిక్సిడ్ డిపాజిట్‌లోకి మార్చుకున్నట్లు ఆరోపించారు. 20 ఏండ్ల బ్యాంకు డిపాజిట్‌తో పాటు చక్రవడ్డీ కలిపి ప్రస్తుతం బ్యాంకులో రూ. 5 కోట్ల వరకు నిల్వ ఉంటుందని తెలిపారు. డీడీఎస్ సంఘం మహిళా సభ్యులకు తెలియకుండానే 103 ఎకరాల భూమిని ఇతరులకు విక్రయించారన్నారు. డీడీఎస్ మహిళా సంఘాల ఆమోదం, స్వచ్ఛంద సంస్థల చట్టాల అనుమతి లేకుండానే దివంగత డీడీఎస్ ప్రాజెక్టు కార్యదర్శి సతీశ్ డయాలసిస్ కోసం డీడీఎస్ ప్రతినిధులు రూ. 3 కోట్ల వరకు ఖర్చుచేశారని పేర్కొన్నారు. డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండా అమ్మిన భూములను తిరిగి ఇవ్వా